

అటానమస్‌కే ఆదరణ
డిగ్రీ కాలేజీలు అడ్మిషన్లు లేక బోసిబోతున్నాయి. అటానమస్ లేని కాలేజీల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపడంలేదు. - 10లో



సమస్యలు పరిష్కరించాలని ధర్నా
రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. - 11లో

గరిష్టం/కనిష్టం
37°/26°

వాతావరణం
పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు ట్రాఫిక్ ఆంక్షలు

భువనగిరిటౌన్ : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో శుక్రవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. భువనగిరి –జగదేవ్‌పూర్ మధ్యలో భారీ వాహనాలు, డీసీఎంలకు అనుమతి లేదు. చిట్యాల నుంచి ప్రజ్ఞాపూర్ వెళ్లే వాహనాలు భువనగిరి పట్టణంలోని నల్లగొండ రోడ్డులో గల అండర్ పాస్ వద్ద నుంచి ఘట్‌కేసర్ అవుటర్ రింగ్ రోడ్డు మీదుగా పోవాలని అధికారులు సూచించారు. ప్రజ్ఞాపూర్ నుంచి భువనగిరి వైపు వెళ్లే వాహనాలను తుర్కపల్లి ఎక్స్‌రోడ్డు నుంచి యాదగిరిగుట్ట, బొమ్మలరామారం వైపు మళ్లించనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 8 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని అధికారులు తెలిపారు.

సభా ఏర్పాట్ల పరిశీలన



సభా స్థలిని పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు, చిత్రంలో అదనపు కలెక్టర్, ఆర్డీఓ

తుర్కపల్లి : మండలంలోని తిర్మలాపూర్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొనే బహిరంగ సభకు పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. గురువారం ఆయన అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీఓ కృష్ణారెడ్డితో కలిసి సభా ఏర్పాట్లను పరిశీలించారు. పార్కింగ్‌కు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశామని, బాంబు, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు.

నాణ్యమైన భోజనం అందించాలి



వంట సిబ్బందితో డీఈఓ సత్యనారాయణ

భువనగిరి: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డీఈఓ సత్యనారాయణ సూచించారు. మోడల్, టీఆర్ఐఎస్, యూఆర్ఎస్, కేజీబీవీల్లో విధులు నిర్వహిస్తున్న వంట సిబ్బందికి కొత్త మెనూపై భువనగిరిలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వంట సిబ్బందికి ఆయన సూచనలు చేశారు. భోజనం, ఆహార పదార్థాలు రుచి, శుచికరంగా ఉండాలన్నారు. శిక్షణ తరగతుల్లో పెంపొందించుకున్న నైపుణ్యాలతో విద్యార్థులకు భోజనం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్ సీహెచ్ రాధ, కేజీబీవీ ప్రత్యేకాధికారులు విజయలక్ష్మి, దుర్గ, ఆర్పీలు అన్నపూర్ణ, స్వరూప, వసంత తదితరులు పాల్గొన్నారు.

యాదగిరి క్షేత్రంలో నిత్యారాధనలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో గురువారం సంప్రదాయ పూజలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేకువజామున స్వామివారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాత సేవ, అనంతరం గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీదళాలతో అర్చన చేశారు. ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజ వాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చనమూర్తులకు అష్టోత్తర పూజలు నిర్వహించారు. ఆయా వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి స్వామివారికి శయనోత్సవం చేసి ఆలయ ద్వారబంధనం చేశారు.

ఉచిత దర్శనం కల్పించాలని వినతి

భువనగిరి: పట్టణ పరిధిలోని స్వర్ణగిరి క్షేత్రంలో ప్రతి బుధవారం భువనగిరి పట్టణంతో పాటు భువనగిరి మండల వాసులకు ఉచిత దర్శన అకాశం కల్పించాలని భజరంగ్‌దళ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఆలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. అదే విధంగా ఆలయం వద్ద పాద రక్షలు, పార్కింగ్ చేసిన వాహనాలకు ఫీజు వసూలు చేయొద్దన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో భజరంగ్‌దళ్ ఉమ్మడి నల్లగొండ జిల్లా కన్వీనర్ సందీప్, పట్టణ కన్వీనర్ నవీన్, నాయకులు అనిల్, శివరాజులు, సంపత్ పాల్గొన్నారు.

హామీల అమలెప్పుడు సారూ..

గుట్ట పాలకమండలి సమీక్షలతోనే సరి.. మూసీ పునరుజ్జీవానికి పడని అడుగులు



యాదగిరిగుట్ట క్షేత్రం



వలిగొండ వద్ద మూసీలో ప్రవహిస్తున్న కలుషిత నీరు

నేడు సీఎం రేవంత్‌రెడ్డి రాక
- తిర్మలాపూర్ బహిరంగ సభలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- హామీలపై ఆశలు పెట్టుకున్న ప్రజలు

సాక్షి, యాదాద్రి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాల్గోసారి జిల్లా పర్యటనకు వస్తున్నారు. సీఎం హోదాలో తొలిసారి యాదగిరిగుట్ట క్షేత్రానికి, ఆ తరువాత మూసీ ప్రక్షాళన పాదయాత్ర కోసం, యాదగిరిగుట్ట ఆలయం స్వర్ణగోపురం ప్రారంభోత్సవానికి వచ్చారు. గత సంవత్సరం నవంబర్‌లో జిల్లాకు వచ్చిన సందర్భంగా యాదగిరిగుట్ట అభివృద్ధి పాలకమండలి, మూసీ పునరుజ్జీవం అంశాలను ప్రకటించారు. అవి ఇంకా కార్యరూపం దాల్చలేదు. శుక్రవారం జిల్లాకు వస్తున్న సీఎం.. గంధమల్ల రిజర్వాయర్, మెడికల్ కళాశాల, వేద పాఠశాల, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్, రోడ్లు, వంతెనల పనులకు శంకుస్థాపనకు చేయనున్నారు. ఈ నేపథ్యంలో పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు, ఇంకా ఏమైనా వరాల జల్లు కురిపించేనా.. అని ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

పెండింగ్‌లో గుట్ట పాలకమండలి
తిరుమల తిరుపతి తరహాలో యాదగిరిగుట్టకు ట్రస్టు బోర్డు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఏడాది క్రితమే ప్రతిపాదించినా నేటికీ కార్యరూపం దాల్చలేదు. పాలకమండలి లేకపోవడంతో భక్తుల సౌకర్యాలకు సంబంధించి పలు అంశాలు పెండింగ్‌లో ఉన్నాయి. అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు. గతంలో ఆలయంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు సుమారు రూ.100 కోట్లు మంజూరుకు నోచుకోలేదు. దీంతో పనులన్నీ అసంపూర్తిగా నిలిచిపోయాయి. కొండపైన భక్తుల వసతులకు సంబంధించిన పలు రకాల పనులను ప్రారంభించాల్సి ఉంది. ప్రధానంగా కల్యాణ మండపం కోసం భక్తులు ఎదురు చూస్తున్నారు.

గోశాల దత్తతను మరిచారు
యాదగిరిగుట్ట దేవస్థానంలో గోసంరక్షణ పాలసీ ఇంకా రూపొందించలేదు. దేవస్థానం గోశాలను మోడల్ గోశాలగా అభివృద్ధి చేయాలని, భక్తులు గోవులను, గోశాలను దత్తత తీసుకునే విధంగా ప్రత్యేక యాప్ ఏర్పాటు చేయాలన్న సూచన కార్యరూపం దాల్చలేదు.

కొత్త రెవెన్యూ డివిజన్లు ఏమాయే..
ఆలేరు, మోత్కూరు రెవెన్యూ డివిజన్లు చేయాలని అక్కడి ప్రజలు కొన్నేళ్లుగా కోరుతున్నారు. ఆలేరు రఘునాథపురం, వేములకొండ మండలాల కోసం పోరాటాలు జరిగాయి. వేములకొండ మండలం ప్రకటించినా అమలు కాలేదు.

బహిరంగ సభకు భారీ జనసమీకరణ
తిర్మలాపూర్ వద్ద జరిగే బహిరంగ సభకు భారీ జన సమీకరణ చేయనున్నారు. సుమారు 50 వేల మంది సభకు వస్తారని పార్టీ నేతలు అంచనా వేస్తున్నారు. సభ జరిగే ప్రాంతానికి సమీపంలో ఉన్న తుర్కపల్లి, బొమ్మలరామారం, రాజాపేట, యాదగిరిగుట్ట మండలాల నుంచి అధికంగా జనసమీకరణపై దృష్టి సారించారు. మహిళలను ఆర్టీసీ బస్సుల్లో, పురుషులను డీసీఎంలలో తరలించడానికి ఏర్పాట్లు చేశారు. మహిళా సంఘాల సభ్యులను సభకు తరలించే బాధ్యతను అధికారులకు అప్పగించారు.

నెరవేరని పునరుజ్జీవ హామీ
ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతులకు ఇచ్చిన మూసీ పునరుజ్జీవం హామీ నెరవేరలేదు. నవంబర్ 8న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వలిగొండ మండలం సంగెంవద్ద స్వయంగా పాదయాత్ర చేసి ప్రకటించారు. రూ.2కోట్లతో సంగెంవద్ద గల బీమ లింగం శివయ్యను దర్శించుకునే ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతానని చెప్పిన మాట అమలు కాలేదు. అలాగే జనవరి 25న మూసీ వెంట వాడపల్లి నుంచి పాదయాత్ర చేస్తానని ప్రకటించినా ప్రారంభం కాలేదు.

సీఎం పర్యటన షెడ్యూల్ ఇలా..



సీఎం రేవంత్‌రెడ్డి తిర్మలాపూర్ సభాస్థలికి మధ్యాహ్నం 3 గంటలకు చేరుకోనున్నారు. 2.40కి హైదరాబాద్ బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి హెలికాప్టర్ ద్వారా బయలుదేరి తిర్మలాపూర్ చేరుకుంటారు. 3.10కి వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం అక్కడే జరిగే బహిరంగసభలో పేదలకు సంక్షేమ పథకాల ప్రొసీడింగ్స్ అందజేస్తారు. 5 గంటలకు హెలికాప్టర్‌లో తిరిగి హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్తారు.

ప్రభుత్వం వద్దే నిధుల ఫైల్



బస్వాపూర్ రిజర్వాయర్

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా 11.39 టీఎంసీల సామర్థ్యంతో చేపట్టి బస్వాపూర్ రిజర్వాయర్ 90 శాతం పనులు పూర్తయ్యాయి. నిర్వాసితులకు పరిహారం రూ.500 కోట్లు ఇవ్వాలి. ఇందులో సేకరించిన భూములకు రూ.250 కోట్లు, ముంపు గ్రామమైన బీఎన్ తిమ్మాపూర్ నిర్వాసితులకు ఆర్అండ్ఆర్‌ప్యాకేజీ కోసం రూ.250 కోట్లు ఇవ్వాలి. ఈ నిధులకు సంబంధించి ఫైల్ ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉంది. రిజర్వాయర్ నిర్మాణానికి 4,238 ఎకరాల భూమి కోల్పోయిన తిమ్మాపూర్, జంగంపల్లి, రుస్తాపూర్, వడపర్తి, బస్వాపూర్ రైతులు ఎదురు చూస్తున్నారు. బీఎన్ తిమ్మాపూర్ ముంపు బాధితులకు రూ.30 కోట్లు ఇటీవల ప్రభుత్వ విడుదల చేసింది. ఇంకా రూ.69 కోట్లు చెల్లిస్తే 1.50 టీఎంసీ నీటితో బస్వాపూర్ రిజర్వాయర్‌ను నింపి రైతులకు అందించవచ్చు.

గంధమల్లకు రోడ్డే లేదు



గంధమల్ల చెరువు

రిజర్వాయర్ నిర్మించనున్న గంధమల్ల పక్కా రోడ్డులేదు. తుర్కపల్లి మండలంలో ఉన్న ఈ గ్రామానికి సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్‌నుంచి తిరిగి వెళ్లాలి. లేదంటే రాజాపేట, బేగంపేట నుంచి వెళ్లాలి. రూ.500 కోట్లతో రిజర్వాయర్ నిర్మాణం చేపట్టబోతున్న గంధమల్ల గ్రామానికి పక్కా రోడ్డు వేయాలని ప్రజలు కోరుతున్నారు. దీంతోపాటు జిల్లాలోని గ్రామీణ రోడ్లుకు నిధుల అవసరం ఉంది. రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. ప్రభుత్వం వచ్చి రెండేళ్లు కావస్తున్నా రోడ్లు మరమ్మతులు లేవు.

రూ.1,500 కోట్ల పనులకు శంకుస్థాపనలు

యాదగిరిగుట్ట : ఆలేరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగానే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా శుక్రవారం సుమారు రూ.1,500 కోట్ల పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. ఇందుకు ఆలేరు నియోజకవర్గంలోని తుర్కపల్లి మండలం తిర్మలాపురం గ్రామం వేదిక కానుంది.

- యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తులకు వసతుల కల్పన, అభివృద్ధి పనులకు రూ.100 కోట్లు కేటాయించారు. టెంపుల్ సిటీలో 15 ఎకరాల్లో రూ.43.79 కోట్లతో వేద పాఠశాల నిర్మాణం. దాతారుపల్లి రెవెన్యూ పరిధిలోని వైటీడీఏ స్థలంలో రూ.180కోట్లతో మెడికల్ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. అలాగే దాతారుపల్లిలో రూ.15కోట్లతో ఏర్పాటు చేసే వేర్ హౌజ్ గోదాములకు వర్చువల్‌గా సీఎం శంకుస్థాపన చేయనున్నారు.



యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ కోసం రాంపూర్‌తండా వద్ద సేకరించిన స్థలం

- తుర్కపల్లి మండల పరిధిలోని గంధమల్ల రిజర్వాయర్ పనులకు, రాంపూర్‌తండా సమీపంలో 15ఎకరాల స్థలంలో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన.
- ఆలేరు నియోజకవర్గంలో రూ.50 కోట్ల నిర్మించనున్న ఆర్అండ్‌బీ రోడ్లకు, రూ.14.50 కోట్లతో ఆలేరు మండలం కొలనుపాక, రాజాపేట మండలం కాల్వపల్లి వాగులపై హైలెవల్ బ్రిడ్జిలు, రూ.30 కోట్లతో సీఆర్ఆర్, ఎంఆర్ఆర్ రోడ్లకు, మోటకొండూర్‌లో రూ.10కోట్లతో ఎంపీపీ, తహసీల్దార్, పోలీస్ స్టేషన్ భవనాలకు, ఆలేరులో రూ.15కోట్లతో నిర్మించే మార్కెట్ యార్డు గోదాములకు శంకుస్థాపన చేస్తారు.

సీఎం వెంట రానున్న ప్రముఖులు
సీఎం రేవంత్‌రెడ్డి వెంట శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దామోదరం రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖతో పాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు రానున్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం



మొక్క నాటి మాట్లాడుతున్న జిల్లా ప్రధాన జడ్జి జయరాజు, చిత్రంలో న్యాయమూర్తులు

భువనగిరిటౌన్ : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అధ్వర్యంలో గురువారం భువనగిరిలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల అవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు, సంస్థ కార్యదర్శి మాధవిలత మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. పర్యావరణాన్ని కాపాడుకుంటేనే మానవాళి మనుగడ ఉంటుందని, అందుకోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. నిషేధిత ప్లాస్టిక్‌ను వినియోగించవద్దన్నారు. ప్లాస్టిక్ వల్ల అనేక అనర్థాలు ఉంటాయని, పర్యావరణ దినోత్సవం సందర్భంగానే కాకుండా జీవన చర్యల్లో ప్లాస్టిక్ నిషేధాన్ని పాటించాలని సూచించారు. మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ముక్తిదా మాట్లాడుతూ నేటి తరానికి ప్రకృతి పర్యావరణంపై అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి యం.ఉషశ్రీ, అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్యాంసుందర్, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి జి.స్వాతి, న్యాయవాదులు చంద్రశేఖర్‌రెడ్డి, రాజిరెడ్డి, బొమ్మ వెంకటేశం,సాగర్, రాజేందర్ రెడ్డి, న్యాయ సహాయ అడ్వకేట్‌లు ఎస్.జైపాల్, జి.శంకర్ తదితరులుపాల్గొన్నారు.

ఐదేళ్లుగా ఎదురుచూపుల్లోనే!

చౌక్లతండా, కోక్యాతండా, పీర్యాతండా నిర్వాసితులకు అందని పరిహారం

- 241 ఎకరాలకు 29 ఎకరాలకే పరిహారం చెల్లింపు
- పునరావాస గ్రామ నిర్మాణానికి నేటికీ మొదలుకాని సన్నాహాలు



గంధమల్ల రిజర్వాయర్‌లో ముంపునకు గురికానున్న చౌక్లతండా

తుర్కపల్లి: బస్వాపూర్ రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతున్న తుర్కపల్లి మండలంలోని నిర్వాసితులకు భూ పరిహారం, పునర్ నిర్మాణ (ఆర్అండ్ఆర్) ప్యాకేజీ కోసం ఎదురుచూపులే మిగిలాయి. ఐదేళ్ల క్రితం 29 ఎకరాలకు పరిహారం చెల్లించగా.. మిగతా భూమికి ఇప్పటి వరకు ఇవ్వలేదు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ప్రస్తావనే లేదు. అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగి అలసిపోయామే తప్పా.. పరిహారం మాత్రం రాలేదని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

241 ఎకరాల భూ సేకరణ
రిజర్వాయర్ కోసం చోక్లాతండా, కోక్యాతండా పూర్తిగా, పీర్యాతండా పాక్షికంగా ముంపునకు గురవుతున్నాయి. బాధిత తండాల్లో అధికారులు సర్వే నిర్వహించి 83 కుటుంబాలు నష్టపోతున్నాయని, ఆయా కుటుంబాల్లో 234 మంది ఉన్నట్లు గుర్తించారు. అంతేకాకుండా వ్యవసాయ భూముల్లోని బోర్లు, చెట్లు, ఫలవృక్షాలు, ప్లాట్లు, ఖాళీ స్థలాలకు ప్రత్యేక పరిహారం చెల్లించాల్సి ఉంది. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద 18 ఏళ్లు పైబడిన ప్రతి వ్యక్తికి రూ.7.61లక్షల చొప్పున అందుతుంది. కానీ, ప్రాజెక్టు పనులు ప్రారంభించి ఏడేళ్లు కావస్తున్నా నేటికీ ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ప్రస్తావనే లేదు. పునరావాస గ్రామ నిర్మాణం కోసం దాతరుపల్లిలో స్థలాన్ని కేటాయించారు. అంతేకాకుండా ఆయా తండాల పరిధిలో 2020 సంవత్సరంలో 241 ఎకరాల భూ సేకరణ చేశారు. అందులో కేవలం 29 ఎకరాలకు మాత్రమే ఐదేళ్ల క్రితం పరిహారం చెల్లించారు. ఎకరానికి కనిష్టంగా రూ.18 లక్షలు, గరిష్టంగా రూ.21.60 లక్షలు నిర్వాసితుల ఖాతాల్లో జమ చేశారు. మిగతా భూముల రైతులు పరిహారం కోసం ఎదురుచూపుల్లోనే గడుపుతున్నారు.

ముంపునకు గురవుతున్న గ్రామాలు ఇవీ..
11.39 టీఎంసీల సామర్థ్యంతో నిర్మిస్తున్న బస్వాపూర్(నృసింహసాగర్) రిజర్వాయర్‌లో భువనగిరి మండలంలోని బీఎన్ తిమ్మాపురం, తుర్కపల్లి మండలంలోని చోక్లాతండా, కోక్యాతండా పూర్తిగా, పీర్యాతండా పాక్షికంగా, యాదగిరిగుట్ట మండలంలోని లప్పానాయక్ తండా ముంపునకు గురవుతున్నాయి. బీఎన్ తిమ్మాపూర్ నిర్వాసితులకు ప్రభుత్వం ఇటీవల రూ.30 కోట్లు విడుదల చేయగా వారి ఖాతాల్లో జమయ్యాయి. మిగతా గ్రామాల విషయంలో తీవ్ర జాప్యం జరుగుతోంది.

అధికారులు, నాయకులకు విన్నవించాం



రిజర్వాయర్ పనులు ప్రారంభించి ఏడేళ్లు కావస్తుంది. ఇప్పటి వరకు అర్అండ్అర్ ప్యాకేజీ అందలేదు. కొత్త ఊరు ఎక్కడ నిర్మిస్తరో కూడా చెప్పడం లేదు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కోసం పలుమార్లు అధికారులు, నాయకులకు విన్నవించాం. త్వరగా పరిహారం డబ్బులు చెల్లించాలి.
– భూక్య సునీత, నిర్వాసితురాలు, చౌక్లతండా

ఎవరికీ పట్టింపులేదు



బస్వాపూర్ రిజర్వాయర్‌లో మా తండా మనిగిపోతుంది. ఐదేళ్ల నుంచి ఎవరూ మా సమస్య పట్టించుకోవడం లేదు. భూ నిర్వాసితుల్లో కొందరికే పరిహారం చెల్లించారు. మిగతా వారికి పైసా కూడా అందలేదు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ గురించి కూడా తేల్చడం లేదు. మాకు న్యాయం చేయాలి.
–భూక్య అంబి, నిర్వాసితురాలు, చౌక్లతండా

చైతన్యపరుచుదాం.. బడిబాట పట్టిద్దాం

ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల పెంపే లక్ష్యం
- నేటి నుంచి బడిబాటకు శ్రీకారం
- 19వ తేదీ వరకు కార్యక్రమాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



ఏప్రిల్‌లో వలిగొండ మండలం ఎం.తుర్కపల్లిలో బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

భువనగిరి: బడీడు, బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించడంతో పాటు విద్యార్థుల సంఖ్య పెంచేందుకు విద్యాశాఖ సిద్ధమైంది. శుక్రవారం నుంచి ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టనుంది. నేటి నుంచి ఈనెల 19వ తేదీ వరకు 14 రోజుల పాటు బడిబాట నిర్వహించనున్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీలు ఇంటింటికీ తిరిగి పిల్లలను, తల్లిదండ్రులను కలిసేలా ప్రణాళిక రూపొందించారు. డిజిటల్ తరగతులు, ఇంగ్లిష్ మీడియం, సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం, ఉచితంగా పాఠ్య పుస్తకాలు, రెండు జతల యూనిఫాం అందజేస్తున్న విషయాన్ని ప్రచారం చేయనున్నారు. ఇప్పటికే ఏప్రిల్ నెలలో నిర్వహించిన బడిబాట ద్వారా 4,040 మంది పిల్లలను పాఠశాలల్లో చేర్పించారు.

రోజువారీగా నిర్వహించే కార్యక్రమాలు
- 6వ తేదీన(నేడు) గ్రామ సభలు నిర్వహించారు. సభల్లో ఆవాస గ్రామాల ప్రజలందరినీ భాగస్వాములు చేయాలి.
- 7న ప్రతి ఇంటినీ సందర్శించి బడీడు పిల్లలు, బడిబయటి పిల్లలను గుర్తించాలి.
- 8 నుంచి 10వ తేదీ వరకు కరపత్రాల ద్వారా ఇంటింటి ప్రచారం నిర్వహించడంతో పాటు మధ్యలో చదువు మానేసిన పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించాలి.
- 11న ఆరు నుంచి 10వ తేదీ వరకు నిర్వహించిన కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించాలి.
- 12న అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు పాఠశాలల్లో చేపట్టిన పనులను ప్రారంభించాలి. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోటుబుక్స్, యూనిఫాం పంపిణీ.
- 13న సామూహిక అక్షరాభ్యాసం, బాలల సభ
- 16న ఎఫ్ఎల్ఎన్, ఎల్ఐపీ దినోత్సవం నిర్వహణ
- 17న విలీన విద్య, బాలికా విద్యా దినోత్సవం..
- 18న తరగతుల డిజిటలైజేషన్‌పై అవగాహన, మొక్కల పెంపకం, ప్రాధాన్యతపై అవగాహన
- 19న బడిబాట ముగింపు సందర్భంగా విద్యార్థులకు ఆటలపోటీలు నిర్వహణ.

పత్తి రైతుకు మద్దతు

ధర క్వింటాకు రూ.589 పెంచిన కేంద్రం
- ప్రస్తుతం 1,15,000 ఎకరాల్లో సాగు అంచనా
- ధర పెంపుతో పెరగనున్న సాగు విస్తీర్ణం
- వరికి రూ.69 పెంపు, నిరాశలో రైతులు



రామన్నపేట: నకిలీ విత్తనాలు, ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్లు, గిట్టుబాటు ధర రాకపోవడం వంటి కారణాలతో పత్తి రైతు ఏటా నష్టాలు చవిచూస్తున్నాడు. ఈక్రమంలో ఆరుగాలం శ్రమించి పంట సాగు చేసిన అన్నదాతలను ఆదుకునేందుకు కేంద్రం ముందుకొచ్చింది. అన్ని రకాల పంటలకు మద్దతు ధర పెంచుతూ నిర్ణయం తీసుకుంది. అత్యధికంగా పత్తికి క్వింటాకు రూ.589 పెంచడం రైతులకు ఊరటనిచ్చింది.

అంచనాలకు మించి సాగయ్యే అవకాశం
జిల్లాలో ఈసారి 1,15,009 ఎకరాల్లో పత్తి సాగు కానున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. కేంద్రం మద్దతు ధర పెంచడంతో సాగు అంచనాలు దాటే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం క్వింటాకు రూ.7,521 ఉండగా.. రూ.589 పెంపుతో ఈ ఏడాది ధర రూ.8,110గా నిర్ణయించింది. వరి తర్వాత పత్తి అత్యధికంగా సాగు చేస్తున్న జిల్లా రైతులకు ధర పెరగడం కలిసొచ్చే అంశంగా కనిపిస్తుంది.

మద్దతు ధర ఇలా.. (క్వింటాకు రూ.లలో)

పంట	గతేడాది	ఈసారి	పెరుగుదల
పత్తి మేలు రకం	7,521	8,110	589
పత్తి సాధారణం	7,121	7,710	589
వరి ఏగ్రేడ్	2,320	2,389	69
వరి (కామన్)	2,300	2,369	69

రూ.5వేల నుంచి రూ.8వేల వరకు అదనపు అదాయం
కాలం అనుకూలిస్తే ఎకరాకు 8 నుంచి 14 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. రేగడి నేలల్లో 20 కింటాళ్ల వరకు వస్తుంది. పెరిగిన మద్దతు ధర ధర వల్ల ఎకరాకు రూ.5వేల నుంచి రూ.8వేలు అదనంగా ఆదాయం వచ్చే అవకాశం ఉన్నది. పై గణాంకాల ప్రకారం 9.20లక్షల క్వింటాళ్లకు పైన రూ.53 కోట్ల ఆదాయం అదనంగా పెరిగే అవకాశం ఉంది. ఏటేటా సాగు ఖర్చులు పెరుగుతున్న తరుణంలో మద్దతు ధర పెంపువల్ల సమకూరే అదనపు ఆదాయం రైతుకు ఎంతో ఊరటనిస్తుంది.

వరి రైతుకు నిరాశే..
పత్తికి మినహా మిగతా పంటలన్నింటికీ మద్దతు ధర తక్కువగా పెంచింది. పెట్టుబడి వ్యయం మాత్రం గత సంవత్సరంతో పోల్చితే పెరగనుంది. పత్తికి క్వింటాకు రూ.586 పెంచిన కేంద్రం.. వరికి కేవలం రూ.69తో సరిపెట్టడం రైతులను నిరాశ పరిచింది. గత ఏడాది వరి ఏ గ్రేడ్ క్వింటా రూ.2,320 ఉండగా మద్దతు ధర పెంపుతో రూ.2,389కి చేరింది. సాధారణ రకం రూ.2,300 నుంచి రూ.2,369కి పెరిగింది. క్వింటా రూ.2,500 పెంచాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

కేంద్ర నిర్ణయం హర్షణీయం



మాది ఉమ్మడి కుటుంబం. ప్రతి సంవత్సరం 30 ఎకరాల్లో పత్తి సాగు చేస్తుంటాం. 200 నుంచి 250 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. సాగు ఖర్చులు, కొలు చెల్లింపులకు పోను పెద్దగా మిగిలేది కాదు. చేతి కష్టం మటుకే మిగిలేది. కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరను పెంచడం హర్షణీయం. రైతులందరికీ సంతోషం కలిగించే విషయం. ఎకరాకు ఐదారు వేల రూపాయలు అదనంగా వచ్చే అవకాశం ఉంటుంది. అయితే సీసీఐ కేంద్రాలను సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లోనే తెరిచి కొనుగోళ్లను ప్రారంభిస్తే రైతులకు ప్రయోజనం ఉంటుంది. మద్దతు ధర పెంపుతో కలిసొచ్చే అవకాశం ఉంటుంది.
–ఎర్రంబెల్లి బాల్‌రెడ్డి, రైతు, ముత్తిరెడ్డిగూడెం

క్లుప్తంగా

చికిత్స పొందుతూ యువకుడు మృతి


దామోదర్ (ఫైల్)

ఆలేరురూరల్: రోడుప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలేరు మండలం కొలనుపాక గ్రామానికి చెందిన బింగి దామోదర్(32) తన తల్లితో ఉంటూ కోడిగుడ్ల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. దామోదర్ బుధవారం పని నిమిత్తం బైక్‌పై ఆలేరుకు వచ్చి తిరిగి సాయంత్రం స్వగ్రామానికి వెళ్తుండగా.. కొలనుపాక వాగు వద్దకు రాగానే బైక్, ఎదురుగా వస్తున్న కారు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దామోదర్‌ను వరంగల్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతిచెందాడు. మృతుడి అన్న గణేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కొండల్‌రావు తెలిపారు.

పశువులను తరలిస్తున్న లారీల పట్టివేత

బీబీనగర్: లారీల్లో అక్రమంగా పశువులను తరలిస్తుండగా బీబీనగర్ మండల పరిధిలోని గూడూరు టోల్‌ప్లాజా వద్ద గురువారం పోలీసులు పట్టుకున్నారు. సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి నుంచి హైదరాబాద్ వైపు రెండు లారీల్లో 155 పశువులను తరలిస్తుండగా పట్టుకుని, సరైన ఆధారాలు చూపకపోవడంతో పశువులను గోశాలకు తరలించినట్లు సీఐ తెలిపారు.

అస్వస్థతకు గురై వ్యక్తి మృతి

చౌటుప్పల్: వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురై వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లా జగ్గయ్యపేట గ్రామానికి చెందిన వ్యక్తి పడాల వెంకటేశ్వరరావు(50) యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని శాంతినగర్‌కాలనీలో నివాసముంటున్నాడు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామ శివారులో గల శ్రీపతి ల్యాబ్ పరిశ్రమలో ప్రొడక్షన్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం ఇంట్లోనే వెంకటేశ్వరరావు వాంతులు, విరేచనాలు చేసుకున్నాడు. శ్వాస తీసుకోవడంలో కూడా ఇబ్బందికి గురయ్యాడు. వెంటనే అతడిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య పడాల పద్మావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

డైట్ సెట్‌లో 20వ ర్యాంకు


రామకృష్ణ

మిర్యాలగూడ టౌన్ : డైట్ సెట్ ఫలితాల్లో మిర్యాలగూడ మండలం బి.అన్నారం గ్రామానికి చెందిన బి.రామకృష్ణ రాష్ట్రస్థాయిలో 20వ ర్యాంకు సాధించాడు. డైట్ సెట్ ప్రవేశ పరీక్షను మే 25న నిర్వహించగా.. గురువారం ఫలితాలు విడుదలయ్యాయి. రామకృష్ణ 5వ తరగతి వరకు బి.అన్నారంలో, ఇంటర్మీడియట్ వరకు రాజపేట గురుకుల పాఠశాలలో, డిగ్రీ నిజాం కళాశాలలో, పీజీ ఓయూలో పూర్తి చేశాడు.

అటానమస్‌కే.. ఆదరణ

- ఉమ్మడి జిల్లాలో డీలా పడ్డ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు
- 'దోస్త్' మొదటి విడతలో 9.2 శాతం మాత్రమే అడ్మిషన్లు
- మూడు ప్రభుత్వ, ఏడు ప్రైవేట్ కళాశాలల్లో సున్నా అడ్మిషన్లు
- 21 కళాశాలల్లో 10మంది లోపే..



కోదాడ: ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు అడ్మిషన్లు లేక వెలవెలబోతున్నాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో అందక ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో సగం కళాశాలలు మూతపడగా.. వారం రోజుల క్రితం దోస్త్ (డిగ్రీ ఆన్‌లైన్ అడ్మిషన్స్ ఇన్ తెలంగాణ) ద్వారా డిగ్రీ కళాశాలలకు జరిగిన మొదటి విడత విద్యార్థుల కేటాయింపు చూసిన తర్వాత ప్రస్తుతం ఉన్న కళాశాలల్లో కూడా సగానికి పైగా మూతపడటం ఖాయమని పలువురు డిగ్రీ కళాశాలల నిర్వాహకులు అంటున్నారు. అటానమస్(స్వయం ప్రతిపత్తి) ఉన్న కళాశాలల్లో మాత్రమే విద్యార్థులు చేరేందుకు ఆసక్తి చూపుతుండగా.. అటానమస్ లేని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో చేరడానికి విద్యార్థులు ఆసక్తి కనబర్చడం లేదు.

పదిశాతం కూడా నిండలేదు..

మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 11 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలుండగా.. వీటిలో మూడు కళాశాలలకు మాత్రమే స్వయం ప్రతిపత్తి(అటానమస్) హోదా ఉంది. దోస్త్ మొదటి విడతలో ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో 2,230 మంది విద్యార్థులు మాత్రమే డిగ్రీ కోర్సుల్లో చేరారు. ఆయా కళాశాలల్లో అందుబాటులో ఉన్న సీట్లలో ఇవి కేవలం 9.2 శాతం మాత్రమే. ఇక స్వయం ప్రతిపత్తి ఉన్న నల్లగొండలోని నాగార్జున(ఎన్జీ) ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల, కోదాడలోని కేఆర్‌ఆర్ డిగ్రీ కళాశాలల్లో 1,271 మంది విద్యార్థులు చేరారు. స్వయం ప్రతిపత్తి లేని 8 ప్రభుత్వ కళాశాలల్లో కేవలం 132 మంది మాత్రమే చేరారు. మూడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో జీరో అడ్మిషన్లు ఉన్నాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

కోదాడలో మిగిలింది ఒక్కటే..

కోదాడలో గతంలో ఒక ప్రభుత్వ, 5 ప్రైవేట్ డిగ్రీ కళాశాలలుండేవి. కేఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సీటు రావాలంటే మంత్రుల స్థాయి పైరవీలు కావాల్సి వచ్చేది. గత విద్యాసంవత్సరం నుంచి ఈ కళాశాల స్వయం ప్రతిపత్తి పొందడంతో ప్రస్తుతం దోస్త్ మొదటి విడతలో 64 మంది విద్యార్థులు చేరారు. రెండు, మూడు విడతల్లో మరికొంత మంది విద్యార్థులు ఇక్కడ చేరుతారని అధ్యాపకులు అంటున్నారు. ఇక నాలుగు ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు ఈ విద్యాసంవత్సరం మొదటి సంవత్సరం అడ్మిషన్లు తీసుకోలేదు. గతంలో మాదిరిగా ఒక్క కేఆర్‌ఆర్ డిగ్రీ కళాశాల మాత్రమే కోదాడలో మిగిలే అవకాశం ఉందని పలువురు విద్యావేత్తలు అంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో దోస్త్ మొదటి విడత అడ్మిషన్ల తీరు ఇలా..

ప్రభుత్వ అటానమస్ కళాశాలలు	03
చేరిన విద్యార్థులు	1272
ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు	08
చేరిన విద్యార్థులు	132
ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు	50
చేరిన విద్యార్థులు	826

నానాటికీ తీసికట్టు

ముఖ్యంగా ప్రైవేట్ డిగ్రీ కళాశాలల పరిస్థితి నానాటికీ తీసికట్టు అన్న చందంగా తయారైంది. ఉమ్మడి జిల్లాలో గతంలో 100కు పైగా ప్రైవేట్ డిగ్రీ కళాశాలలుండగా.. ప్రస్తుతం వాటి సంఖ్య 50కు చేరింది. ఈ కళాశాలలన్నింటిలో కలిపి దోస్త్ మొదటి విడతలో కేవలం 826 మంది విద్యార్థులు మాత్రమే చేరారు. 7 ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో సున్నా అడ్మిషన్లు ఉండగా.. 16 కళాశాలల్లో 10లోపు విద్యార్థులు మాత్రమే అడ్మిషన్లు తీసుకున్నారు. కొన్ని కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య కన్నా అధ్యాపకుల సంఖ్యే ఎక్కువగా ఉంది. కళాశాలల్లో చేరిన 10మంది విద్యార్థుల్లో ఒక్కో గ్రూప్‌నకు ఇద్దరు ముగ్గురు మాత్రమే చేరారు. వీరితో మూడు సంవత్సరాలు తరగతులు ఎలా నిర్వహించాలో అర్థం కావడం లేదని, రెండో విడతలో చేరిన విద్యార్థులను బట్టి కళాశాల నిర్వహణపై నిర్ణయం తీసుకుంటామని ప్రైవేట్ కళాశాలల యజమానులు చెబుతున్నారు.

పేదలను ప్రభుత్వం ఆదుకోవాలి


రెడ్డి సంక్షేమ సంఘం భవనాన్ని ప్రారంభిస్తున్న గంగిడి ప్రతాప్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి: రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసి రెడ్డి సామాజిక వర్గంలోని పేదలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని రెడ్డి సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు గంగిడి ప్రతాప్‌రెడ్డి అన్నారు. పోచంపల్లిలో నూతనంగా నిర్మించిన రెడ్డి సంక్షేమ సంఘం నూతన భవనాన్ని స్థల దాత గంగిడి నర్సింహారెడ్డితో కలిసి గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. రెడ్డి సామాజిక వర్గంలో కూడా ఎందరో నిరుపేదలున్నారని అన్నారు. వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, తెల్ల రేషన్‌కార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం స్థల దాతతో పాటు భవన నిర్మాణానికి సహకరించిన దాతలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు రామసాని చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు నోముల నాగిరెడ్డి, ఏనుగు సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శి సగ్గు మల్లారెడ్డి, సహాయ కార్యదర్శి కొమిరెల్లి శేఖర్‌రెడ్డి, కోశాధికారి కేసారం కొండల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు కోట పుష్పలత మల్లారెడ్డి, గుణంగారి సదానందరెడ్డి, ఏనుగు కిషన్‌రెడ్డి, బొక్క బాల్‌రెడ్డి, సామల మల్లారెడ్డి, కొమిరెల్లి బాల్‌రెడ్డి, గంగిడి సుదర్శన్‌రెడ్డి, నోముల భీమ్‌రెడ్డి, ఏనుగు మధుసూధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలి


రైతులకు వరి సాగుపై అవగాహన కల్పిస్తున్న భారత వరి పరిశోధనా సంస్థ శాస్త్రవేత్త శ్రీదేవి

తాళ్లగడ్డ (సూర్యాపేట): వరి సాగులో అధిక దిగుబడికి సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలని ఐసీఏఆర్, భారత వరి పరిశోధనా సంస్థ–హైదరాబాద్ ప్రధాన శాస్త్రవేత్త బి. శ్రీదేవి అన్నారు. సూర్యాపేట మండలం తాళ్ల ఖమ్మంపహాడ్ గ్రామంలో గురువారం కృషి విజ్ఞాన కేంద్రం గడ్డిపల్లి ఆధ్వర్యంలో నిర్వహించిన వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో ఆమె పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం కేవీకే శాస్త్రవేత్త నరేష్ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు అందిస్తున్న సేవలు, శిక్షణ కార్యక్రమాలను రైతులు ఉపయోగించుకోవాలని కోరారు. జీవ ఎరువులు, శిలీంద్రనాశినిల గురించి రైతులకు తెలియజేశారు. గృహ విజ్ఞాన శాస్త్రవేత్త ఎస్. సుగంధి మాట్లాడుతూ.. చిరుధాన్యాలతో తయారుచేసే ఉత్పత్తుల గురించి రైతులకు వివరించారు. అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రైతులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ముత్తయ్య, గ్రామ కార్యదర్శి కె. రేవతి, తుమ్మల రాము, వై. శ్రీను, కనకయ్య శంకర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ది కమీషన్ల ప్రభుత్వం

- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు

నల్లగొండ టూటౌన్ : కాంగ్రెస్‌ది కమీషన్ల ప్రభుత్వంగా మారిందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు విమర్శించారు. మోదీ ప్రభుత్వం 11 ఏళ్ల పరిపాలనపై గురువారం నల్లగొండలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచంలోనే డిజిటల్ లావాదేవీల్లో భారతదేశంలోనే 40 శాతం ఉండటం గర్వకారణమన్నారు. దేశంలో 80 శాతం మంది ప్రజలకు రేషన్ బియ్యం ఇస్తున్నట్లు తెలిపారు. 11 ఏళ్ల కేంద్ర ప్రభుత్వ విజయాలను బీజేపీ కార్యకర్తలు ప్రజల్లో ప్రచారం చేయాలని కోరారు. జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉన్నా ఒరిగింది శూన్యమన్నారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా నల్లగొండలోని 16వ వార్డులో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాసగౌడ్, పల్లెబోయిన శ్యాంసుందర్, వీరెల్లి చంద్రశేఖర్, పోతెపాక లింగస్వామి, రాములు, పకీర్ మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్ మృతి


శ్రీను (ఫైల్)

నడిగూడెం: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడడంతో డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన గురువారం నడిగూడెం మండల పరిధిలోని సిరిపురం గ్రామంలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిపురం గ్రామానికి చెందిన ఆత్కూరి శ్రీను (40) అదే గ్రామానికి చెందిన ఓ రైతు వ్యవసాయ భూమికి గురువారం ట్రాక్టర్‌లో మట్టి తోలుతుండగా.. ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తాపడింది. ఈ ప్రమాదంలో శ్రీను అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. మృతుడి తల్లి మహాలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నడిగూడెం స్టేషన్ ఇన్‌చార్జి మల్సూర్ తెలిపారు.

పొలం దున్ని వస్తుండగా..


ఉపేందర్‌రెడ్డి (ఫైల్)

గరిడేపల్లి: గరిడేపల్లి మండలం సర్వారం గ్రామానికి చెందిన కర్నాటి ఉపేందర్‌రెడ్డి(35) గురువారం తన పొలంలో దుక్కి దున్ని ట్రాక్టర్‌పై ఇంటికి వస్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడింది. ట్రాక్టర్ ఉపేందర్‌రెడ్డిపై పడటంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

యాదగిరీశుడి సేవలో ఉత్తరాఖండ్ ఎంపీ

యాదగిరిగుట్ట: యాదగిరీశుడిని ఉత్తరాఖండ్ రాజ్యసభ సభ్యుడు నరేష్ బన్సల్ కుటుంబ సభ్యులతో కలిసి గురువారం దర్శించుకున్నారు. గర్భాలయంలోని స్వయంభూలను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి, ముఖ మండపంలో అష్టోత్తర పూజల్లో పాల్గొన్నారు. ఎంపీ కుటుంబ సభ్యులకు అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.


రాజ్యసభ సభ్యుడు నరేష్ బన్సల్‌కు వేద ఆశీర్వచనం చేస్తున్న అర్చకులు

శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం

మఠంపల్లి: మండలంలోని మట్టపల్లి దేవాలయంలో గురువారం లక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను గరుడ వాహనంపై ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నివారణపై అవగాహన

తాళ్లగడ్డ (సూర్యాపేట): సూర్యాపేట మండలంలోని రాయినిగూడెం వికాస్ ఫార్మసీ కళాశాలలో తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో గురువారం యాంటీ డ్రగ్ అవేర్‌నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఇందులో భాగంగా కళాశాలలో వివిధ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నీల మాట్లాడుతూ.. డ్రగ్స్ విషం కన్నా ప్రమాదమైనదని, యువత డ్రగ్స్‌కు బానిసై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. సమాజంలో ప్రతిఒక్కరూ తమ వంతు బాధ్యతగా డ్రగ్స్ నివారణకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పెద్దింటి నవీన్‌కుమార్, అధ్యాపకులు డాక్టర్ స్వరూప, డాక్టర్ నరసింహారావు, డాక్టర్ నటేష్, మహేష్, ప్రీతం కుమార్, సుజాత, భవాని, తులసి, ఫర్హీన్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



డ్రగ్స్ నివారణపై అవగాహన కల్పిస్తున్న నార్కోటిక్స్ బ్యూరో సభ్యులు

సీఎం సభకు భారీ ఏర్పాట్లు


ప్రజలు కూర్చునేందుకు ఏర్పాటు చేసిన గ్యాలరీలు

- 100 మంది కూర్చునేలా వేదిక ఏర్పాటు
- 21 వేల మంది లబ్ధిదారుల కోసం ప్రత్యేక గ్యాలరీ
- 1500 మంది పోలీసులతో భారీ బందోబస్తు

యాదగిరిగుట్ట: తుర్కపల్లి మండలం తిర్మలాపూర్‌లో శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొననున్న బహిరంగ సభ కోసం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలేరు నియోజకవర్గ వ్యాప్తంగా రూ.1,500కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనతో పాటు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్‌లు, రేషన్‌కార్డులు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు సీఎం అందజేయనున్నారు. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య స్వయంగా సభా ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు, అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డితో పాటు ఆయా శాఖల అధికారులు దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

భారీ వేదిక..

వర్చువల్‌గా అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేసిన అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. 20 ఎకరాల్లో బహిరంగ సభకు సంబంధించిన స్థలాన్ని తీర్చిదిద్దారు. సీఎంతో పాటు మంత్రులు, ఇతర ప్రముఖులు, ఎమ్మెల్యేలు, ఎంపీలతో పాటు సుమారు 100 మంది కూర్చునేలా వేదికను సిద్ధం చేశారు. వర్షం పడితే ప్రజలకు ఇబ్బందులు లేకుండా రెయిన్ ప్రూఫ్ టెంట్లు, ఎల్‌ఈడీ స్క్రీన్‌లను సైతం ఏర్పాటు చేశారు. సభ సాయంత్రం జరగనున్న నేపథ్యంలో విద్యుత్ దీపాలు సైతం బిగిస్తున్నారు. ప్రజలు, నాయకులు, కార్యకర్తలతో పాటు మీడియాకు, వివిధ శాఖ అధికారులు, ఆలేరు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే 21వేల మంది లబ్ధిదారులు కూర్చునేందుకు ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేశారు. సీఎం చేతుల మీదుగా 12మంది లబ్ధిదారులు ప్రొసీడింగ్‌లు, చెక్కులు అందుకోనున్నారు.

ప్రత్యేక బందోబస్తు..

రాచకొండ సీపీ సుధీర్‌బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం ఉదయం నుంచి సభ ముగిసే వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఐదుగురు డీసీపీలు, 12మంది అదనపు డీసీపీ, 20మంది ఏసీపీలు, 50మంది సీఐలు, 150 మంది ఎస్ఐలు సివిల్, ట్రాఫిక్, సీఆర్‌పీఎఫ్, ఎస్‌బీ, ఇంటలిజెన్స్ పోలీసులతో పాటు 1500 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు.

అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం..

తుర్కపల్లి, బీబీనగర్: సభలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు రాచకొండ సీపీ సుధీర్‌బాబు తెలిపారు. గురువారం సభా వేదికను ఆయన పరిశీలించి మాట్లాడారు. సీఎం హెలికాప్టర్ ల్యాండింగ్ ప్రదేశంతో పాటు సభా వేదిక చుట్టూ మెటల్ డిటెక్టర్లను అమర్చినట్లు తెలిపారు. అదేవిధంగా వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారిపై బీబీనగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును కూడా సీపీ సుధీర్‌బాబు పరిశీలించారు. ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలకు సంబంధించి పోలీసులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట డీసీపీ అక్షాంశ్‌యాదవ్ ఉన్నారు.


సభా వేదికను పరిశీలిస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు

ట్రాఫిక్ ఆంక్షలు..

ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. తిర్మలాపూర్, వీరారెడ్డిపల్లి గ్రామాల సమీపంలో సుమారు 30 ఎకరాల స్థలంలో వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నారు. నాలుగు చోట్ల పార్కింగ్ కోసం స్థలాన్ని సిద్ధం చేశారు. మొత్తం 4 విభాగాలుగా పార్కింగ్ స్థలాన్ని విభజించి, ట్రాఫిక్ పోలీసులు సూచించిన స్థలంలో ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలు నిలిపేలా చర్యలు తీసుకుంటామని పోలీస్ ఉన్నతాధికారులు తెలిపారు.

సభా స్థలంలోనే శంకుస్థాపన..

తుర్కపల్లి: గంధమల్ల రిజర్వాయర్, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, మోటకొండూరు మండల కేంద్రంలో ఎంపీడీఓ, తహసీల్దార్, పోలీస్ స్టేషన్ భవన నిర్మాణాలకు, రోడ్లు, దాతర్‌పల్లిలో గోదాములు, కొలనుపాక, కాల్వపల్లి హైలెవల్ బ్రిడ్జిలకు సభా స్థలంలోనే సీఎం శంకుస్థాపన చేయనున్నారు.

సభ ఏర్పాట్లపై సమీక్ష..

సభ స్థలాన్ని అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీఓ కృష్ణారెడ్డితో కలిసి కలెక్టర్ హనుమంతరావు పరిశీలించారు. ఈ సందర్భంగా సభ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ దేశ్యా నాయక్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు


బోల్తా పడిన కారు


నుజ్జునుజ్జయిన ద్విచక్ర వాహనం

- నలుగురికి గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం

శాలిగౌరారం: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టడంతో నలుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన 365వ నంబర్ జాతీయ రహదారిపై శాలిగౌరారం మండలం పెర్కకొండారం గ్రామ సమీపంలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం ధర్మారం గ్రామానికి చెందిన మందుల ముఖేష్, బూరుగుల సన్నీ, సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండల కేంద్రానికి చెందిన కట్టెకోల సాయిచరణ్ కలిసి ద్విచక్ర వాహనంపై 365వ నంబర్ జాతీయ రహదారి మీదుగా హైదరాబాద్‌కు వెళ్తుండగా.. అదే సమయంలో హైదరాబాద్ నుంచి మరిపెడ బంగ్లాకు అతివేగంగా వెళ్తున్న కారు శాలిగౌరారం మండలం పెర్కకొండారం గ్రామ సమీపంలోని ఫంక్షన్‌హాల్ వద్ద ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ నుజ్జునుజ్జు కాగా.. మందుల ముఖేష్, బూరుగుల సన్నీ, కట్టెకోల సాయిచరణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కారు జాతీయ రహదారి పక్కన బోల్తా పడడంతో కారు నడుపుతున్న వ్యక్తికి కూడా గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో నకిరేకల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మందుల ముఖేష్, కట్టెకోల సాయిచరణ్‌ను మెరుగైన వైద్యం కోసం నల్లగొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సాయిచరణ్ పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.